


# లోహం

ఖరీదైన బంగ్లా... దాని ముందల లాన్‌ల కొడుకు ఆడుతుంటె బంతి అందిస్తున్నది పద్మజ. ఆడు బంతిని తన బుడ్డ బుడ్డ చేతుల్తోని బలంకొద్దిగ ఇసుర్తున్నడు. బంతి ఎంత దూరం పడితె– తల్లి ఎంత ఎక్కువ దూరం ఉరుకాల్సి వస్తె – అంత ఎక్కువ ఖుష్షవుతు చేతులు టపటప కొడుతున్నడు. ఈసారి బంతి ఒక్కయి ఏస్తె ఇంకోకయి పొయి గేటుపై అంచును తాకి అవతల పడ్డది. పద్మజ ఆశ్చర్యం నటిస్తు 'ఆ... ఏది బాల్?' అనుకుంట చేత్తోని అడిగింది. ఆడు తన చేతుల్ని లేదు అన్నట్లు తిప్పుకుంట 'పొయింది.. పొయింది' అంటున్నడు. దగ్గర్కి ఉరికి ఎత్తుకొని ముద్దుల్తోటి ముంచెత్తి గేట్ దిక్కు నడిచింది పద్మజ. గేట్ తీసి బంతి ఎటు దిక్కు పడ్డదా అని చూస్తున్నది.

బంతి ఎటు దిక్కు పడ్డదోగని –తన ఎదురుంగ ఆ బాట అవతలి దిక్కు నుంచి నడిచెళ్తున్న మనిషిని చూసి పరేశానయ్యింది పద్మజ. ఎంతో తెలిసిన ముఖం.. బాగా ఎరిగిన నడక.. అతను.. అతను.. సుల్తాన్ ! స్థాణువులెక్క నిలబడిపొయింది.. గుండె ఊటగ కొట్టుకుంటున్నది.. కండ్లు కొట్టుకోడం మానేసినయ్. అతన్నే చూస్తున్నది. అతను ఇటుదిక్కు చూడకుంటనె తన మానాన తను నడిచెల్లిపోతున్నడు. మొఖంల అదే కళ.. నడకల అదే హుషారు.. 'సుల్తాన్! సుల్తాన్!' పద్మజ పిలిచింది. పిలుస్తున్నది.. అతను వినడం లేదా? లేదు, అసలు పద్మజ నోటినుంచి ఆ పిలుపు బైటికొస్తె గదా, ఆమె నోటితో పాటు ఆమె మనసు, మెదడు.. అంతా మొద్దుబారిపొయ్‌నయ్. ఆమె అట్లనె నిలబడి ఉన్నది. కొడుకొచ్చి 'మమ్మీ! బాల్, మమ్మీ! బాల్' అని ఊపుతుంటె ఎప్పటికో ఈ లోకంలకొచ్చింది. వెంటనె సుల్తాన్‌కోసం ఎతుక్కున్నది. అప్పటికె సుల్తాన్

ఆ రోడ్డు మలుపు తిరిగినట్లుంది. కనిపించలె. విలువైందేదో పోగొట్టుకున్నట్లుగ మనసంత ఖాళీగ, దిగులుగ ఏదో అయ్‌పొయింది...

2

'పద్మజ అంటె పద్మంలోంచి పుట్టినదని అర్థం కదా! అంతే నిర్మలంగ ఉంటావ్ పద్మజా నువ్వు'

'హొద్దు.. నన్ను పొగడకు నువ్వు. ఏంటో చెప్పు'

'అరె.. నిన్ను దగ్గర్నించి చూస్తె, నీ నవ్వునీ, పలువరసనీ, నీ కళ్ల రెపరెపల్ని చూస్తుంటె నాకెట్లా అనిపిస్తుందో అట్లా బైటికి అనెయ్యకుండ ఎట్లా ఉండను?'

'సరె.. అను బాబూ ఇంకా అను..'

'ఇవాల నీ జడల స్టైల్ బాగుంది.. డ్రస్ బాగా మ్యాచ్ ఐంది. వోనీ ఉంది చూడూ, నీ ఫేస్‌లోకి కొంచెం మ్యాచ్ అవుతూ యమ అందాన్నిస్తోంది.. పెదవులకి పెట్టీ పెట్టకుండ లిప్‌స్టిక్ పెట్టావ్ కదూ, ఫ్చ్, నా కదేం నచ్చలె. లిప్‌స్టిక్ పెట్టకున్నా నీ పెదవులు అందంగ మృదువుగ ఉంటయ్. అసలు పెట్టకుంటేనే సున్నితంగ కన్పిస్తయ్.. అయ్‌నా ఇప్పుడు వాటిని చూస్తుంటె మాత్రం...'

'ఊఁ, ఏమనిపిస్తుందో చెప్పు? ...ముద్దు పెట్టుకోవాలనిపిస్తుందా?'

'అహఁహఁ! అంత మాటంటనా!'

'ఆ ధైర్యం మాత్రం ఎందుకు లేదు?!'

'ధైర్యమంటె ఉందనుకో.. ఏదో అడ్డొస్తుంది. పైగ నువ్వు ఫ్రెండ్‌షిప్ కట్ చేస్తే అన్న భయమో.. లేదంటె, నువ్వు కాదంటె దెబ్బతినే అభిమానం గురించో...'

'నీకు అభిమానం ముఖ్యం కాదనుకుంట? అనుకున్నది చేసేస్తుంటానంటావ్ కదా..'

'అది కరక్టే..'

'ఎగ్జామ్స్ దగ్గర పడుతున్నాయ్, వెళ్లి చదువుకోవాలి సుల్తాన్. నువ్వు కూడ ఇంటికెళ్లి చదువుకో.. నేను వెళ్తున్న. బాయ్..'

☯ ☯

టేబుల్ లైట్ ఆరుతూ వెలుగుతూ ఉంది. దాన్నా పని చేయిస్తున్నది పద్మజ. టేబుల్ మీద పుస్తకం పెట్టుకొని కూసొని ఉంది కాని ఆమె మనసుల ఎన్నో ఆలోచనలు పుస్తకం రెమ్మల్లా కొట్టుకుంటున్నయ్ గాలికి.. ఆ చల్లని గాలి ప్రేమనా? ఏమో..

కిరణ్ మెదుల్తుండు పద్మజ మనసుల–

'పద్మజా! నేన్నీతో కొంచెం మాట్లాడాలి'

'మాట్లాడు'

'లేదు, కొంచెం ఎక్కువ టైం మాట్లాడాలి. ఆ పార్క్‌లో కూర్చుందామా?'

'అఁ.. రేపు మాట్లాడుకుంటె..'

'లేదు, ఇప్పుడే..'

'తొందర్గ ముగిస్తావా?'

'ఒక అర్ధగంట చాలు..'

'ఓ.కె.'

... ... ...

'చెప్పు'

'నేనేం చెప్పబోతున్నానో బహుశా నీకు అర్ధమైపోయి ఉంటుంది. ఇందాక సుల్తాన్ నీతో మాట్లాడ్డం చూశాను. వాడేం మాట్లాడి ఉంటాడో చూచాయగ అర్ధమైంది.. ఇంకా నా మనసులో చెలరేగుతున్న భావాలు నాలోనే ఉంచుకోవడం సరైంది కాదనిపించింది. అందుకే నీతో చెప్పెయ్యా లనుకుంటున్నాను. నువ్వు నీ అభిప్రాయం ఇప్పుడే చెప్పాల్సిన అవసరం లేదు. ఆలోచించి చెప్పు. పద్మజా! మనం ముగ్గురం తెలివైన వాళ్లమే. తల్చుకుంటె ఏమైనా సాధించగల సత్తా మనకుంది. నా గురించి నీకు తెలుసు. ఫస్టియర్‌లో నాకన్నా సుల్తాన్‌కి మార్కులెక్కువొచ్చాయ్. ఛాలెంజ్‌గ తీస్కున్నాను. సెకండియర్‌లో వాడికంటే ఎక్కువ స్కోర్ చేశాను. ఈసారి కూడ వాడికన్నా ఎక్కువ మార్కులొచ్చేలా చదువుతున్నా. నేను జాబ్ కంపల్సరీ సంపాదించుకుంటాను.. ఏదన్న కష్టమైనా మా నాన్న డబ్బు పెట్టడానికి వెనకాడడు. ఆ తర్వాత నాకున్న తెలివినంత ఉపయోగిస్తా, చాలా తక్కువకాలంలో మంచి ఫ్లాట్ ఒకటి కొని అందమైన బిల్డింగ్ ఒకటి కట్టకపోతే చూడు..'

'ఇదంత ఎందుకు చెప్తున్నట్టు?'

'ఎందుకంటే.. నేన్నిన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను పద్మజా! మా ఇంట్లో కూడా చెప్పేశాను. ముందు నీ అభిప్రాయం తెలుసుకోమన్నారు. నువ్వు ఓకె అంటే.. మనిద్దరం ఒకటైతే, ఏదనుకుంటే అది సాధించొచ్చు..'

'.... .... ....!'

'.... .... ....?'

'నేను ఓ.కె. అంటాననే నమ్మకం ఉందా నీకు?'

'గట్టి నమ్మకంగ ఉంది పద్మజా! అసలు నేను ఈ విషయం చెప్పడానికి లేట్ చేశానేమో ననిపిస్తుంది. ఎప్పుడో చెప్పి ఉండాల్సింది. రోజూ ఎంతగానో మదనపడుతున్నాను. అసలు ప్రతిక్షణం నీ ఆలోచనలే నన్ను చంపేస్తున్నాయ్. ఒక్కోసారి ఏం చేస్తున్నానో నా కర్థమే కావడంలేదు. నీ ఆలోచనల్తో పరధ్యానం

ఎక్కువైపోతోంది. అసలు నువ్వు లేకుండా నేనుండలేనేమో అనిపిస్తోంది పద్మజా! నువ్వు కాదంటే నేనేమైపోతానో తెలియదు...'

'హేయ్ కిరణ్! కంట్రోల్ యువర్ సెల్ఫ్. నువ్వు అంతగా టెన్షన్‌కి గురయితే ఎట్లా? అసలిప్పుడు నన్ను టెన్షన్‌లో పడేశావుగా! ఓకె, వెళ్దాం పద. నాకు ఆలోచించుకుంటానికి కొంచెం టైం ఇవ్వు'

'ఇంకో విషయం కూడా నీకు చెప్పాలి పద్మజా. సుల్తాన్ అంటె నాకు దురభిప్రాయం లేదు. వాడు చాలా మంచివాడు. కాని వాడు ఎప్పుడేం చేస్తాడో వాడికే తెలియదు. అసలెప్పుడైనా మనతో వాడి ఎయిమ్ ఏంటో చెప్పాడా? అది వాడికే తెలియదు. ఎప్పుడేది కరెక్ట్ అనిపిస్తే అది మాట్లాడేస్తాడు. అసలు వాడేదైనా జాబ్ చేస్తాడా అనేది కూడా నమ్మకం లేదు. జాబ్ అంటే ఇంట్రస్టే లేదంటాడు. ఎప్పుడూ కవిత్వం, సాహిత్యం అంటూ తిరుగుతుంటాడు. ఎక్కడ సాహిత్య సభ జరిగితే అక్కడ హాజర్! మంచి కవే కావొచ్చు. కాదనను. కాని ఇలా కవిత్వం కవిత్వం అని తిరిగేవాళ్లంతా ఏమయ్యారు. శ్రీశ్రీ దగ్గర్నించి అలిశెట్టి ప్రభాకర్ దాకా ఎంతోమంది అతి దారుణమైన పేదరికాన్ని అనుభవించారు. నువ్వు ఆలోచించు పద్మజా! నీకు సుఖమైన, ధనవంతమైన జీవితం కావాలా? అతి పేదరికం కావాలా? ...పైగా సుల్తాన్ ముస్లిం అన్న సంగతి మరచిపోతున్నావేమో?!'

'ఓ.కె. బాయ్ కిరణ్. రేపు కలుద్దాం'

'నీ నిర్ణయం రేపు చెబుతావా పద్మజా?'

'లేదు కిరణ్. నాకొంచెం టైం ఇవ్వు'

'ఓ.కె.'

'బాయ్'

–టేబుల్ లైట్ బంద్ చేసి బెడ్‌లైట్ వేసి పండుకుంటాన్కి పక్కమీద ఒరిగింది పద్మజ. నిద్ర పడ్తట్టు లేదు. ఏదో 'కళ'తో మైమరిపించే సుల్తాన్ మొఖం... ఆ నవ్వు మొఖం పరచుకొన్నది మనసునిండా... మంచివాడు. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటాడు. జెలసీ, అసూయల్లాంటివేం కనపడవు... ముస్లిం కాకపోయివుంటే ఎంత బాగుండు... కనీసం ముస్లిం అని తెలియకుండా ఉంటే ఇంకెంత బాగుండేదో.. కాని కిరణ్ అన్నట్లు ఎప్పుడూ ఒక్కమాటమీద నిలబడడు. ఎప్పటికేది కరెక్ట్ అనిపిస్తే అదే రైట్ అంటాడు. కాని అదెట్లా కరెక్టవుతుంది. ఏ విషయంలోనైనా ఒక స్థిర నిశ్చయానికి ఎందుకు రాకూడదు! ఇంతకూ తను ఎవర్ని ఎక్కువ ఇష్టపడుతున్నట్లు? సుల్తాన్ అంటే ఇష్టమే. కాని కిరణంత నమ్మకంగా అతను మాట్లాడడు. కిరణ్‌లో కొంచెం స్వార్థం ఎక్కువే. క్యాల్‌క్యులేటెడ్ మైండ్! అప్పుడు ఫస్టియర్లో సుల్తాన్‌కన్నా

మార్కులు తక్కువొచ్చాయని ఎంతగా ఫీలయ్యాడు. కష్టపడి చదివి క్లాస్ ఫస్ట్ వచ్చాడు. కాని ఒకటి మాత్రం స్పష్టం, సుల్తానంత పెద్ద మనసు కాదు కిరణ్‌ది. ఫస్టియర్లో తనకన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడని సుల్తాన్‌తో ఫ్రీగా మూవ్ కూడా కాలేకపోయాడు. అదే కిరణ్ ఫస్టొచ్చినప్పుడు దగ్గరికెళ్లి షేక్‌హ్యాండ్ ఇచ్చి కంగ్రాట్స్ చెప్పాడు సుల్తాన్. కాని తర్వాత కిరణ్‌కన్నా బాగా చదవాలని సుల్తాన్ పట్టుదల చూపకపోవడమే తనకు నచ్చలేదు. కిరణ్ మాత్రం చాలా పట్టుదల మనిషి. తనకా పట్టుదల నచ్చింది.. ఆ నచ్చడం పెళ్లి చేసుకునే అంతనా? అదే ఆలోచించుకోవాలి. ఇంతకూ తనకు ఎవరంటే ఎక్కువ ఇష్టం? ఏమో...

☯ ☯

'హాయ్ సుల్తాన్!'

'హాయ్ పద్మజా! ఏంటి, క్లాసులో చాలా పరధ్యానంగా కూర్చున్నావ్?'

'ఏం లేదు. రాత్రి నిద్ర లేదు. డల్‌గా ఉంది'

'ఏఁ, ఎందుకు లేదు, కొంపదీసి నా గురించైతే ఆలోచిస్తూ ఉండిపోలేదు కదా!'

'చాలు చాలు. అంత ఆశ పడకు'

'ఎందుకు పడకూడదు. ఒక హుషారైన అమ్మాయి నన్ను ఇష్టపడుతూ ఒక రాత్రి నిద్రపట్టకుండా పక్కంతా ఒక్కటి చేస్తే బాగుండు అని నేనెందుకు ఆశ పడకూడదు?'

'అంటే... ఆ అమ్మాయి రాత్రంతా నిద్రపట్టక ఆలోచించేంత ఇష్టపడుతున్నావా నువ్వు?'

'అదే ఎందుకు పడకూడదు అంటున్నా?'

'అహఁ, అంత ఇష్టపడుతున్నావా? నాకైతే నమ్మకం లేదు.'

'మరెలా చెప్పమంటావ్ చెప్పు. నా ఇష్టాన్ని చెప్పుకునే క్లూ ఏదైనా చెప్పు. నాకేమో నాటకాలాడడం రాదు. సినిమాల్లో చూసే రొటీన్ డైలాగ్స్ చెప్పడం నాకస్సలిష్టం ఉండదు. ఎట్లా చెప్పాలబ్బా?...'

'ఊఁ... నువ్వు కవివి కదా. కవిత రూపంలో చెప్పు?'

'ఆహ! ఈ ఐడియా బాగుంది. నీకోసం ఒక కవిత రాసుకొస్తాను. సరేనా–'

'ఎప్పుడు వినిపిస్తావ్?'

'హాయ్ పద్మజా! హలో సుల్తాన్'

'హాయ్ కిరణ్'

'హలో'

'ఏంటి విశేషాలు?'

‘ఏమున్నయ్! పద్మజకు రాత్రి నిద్రపట్టలేదట. ఎందుకై ఉంటుందంటావ్?’

‘అలాగా. అందుకేనా ఉదయంనుంచి డల్‌గా ఉంది’

‘నడుస్తూ మాట్లాడుకుందామా?’

‘నేను, పద్మజ కొంచెం ఆగి వస్తాం సుల్తాన్’

...! ‘ఒకె. కలుద్దాం. బాయ్’ ఇబ్బందిగ కదిలి ఎళ్లిపొయ్యిందు సుల్తాన్. .......

‘ఏమైనా డిసిషన్ తీసుకున్నావా పద్మజా?’

‘ఇంకా లేదు కిరణ్. నాకింకా టైం కావాలి’

‘నీ ప్రాబ్లం ఏంటి చెప్పు. మీవాళ్లు ఒప్పుకోకపోడానికి అవకాశమైతే లేదు. మీ మేనోళ్లెవరైనా ఉన్నారా?’

‘ప్రాబ్లం అదికాదు. నేను ఆలోచించుకోవాలి. అసలు నేనేంటో ఆలోచించుకోవాలి’

‘ఎంత టైం కావాలి?’

‘చెప్పలేను. వారమైనా కావొచ్చు. నెలైనా పట్టొచ్చు’

‘అంత టైం నేను భరించలేను పద్మజా. ఇప్పటికే టెన్షన్ భరించలేకుండా ఉన్నాను. నువ్వు సుల్తాన్ గురించి ఆలోచిస్తున్నావా? ఒక ముస్లింను చేసుకుంటానంటే మీ ఇంట్లో ఊరుకుంటారా?! అయినా ఈ కవులనేవాళ్లు జీవితాంతం ఒక్కరితోనే ఉంటారనే నమ్మకం కూడా ఉండదు పద్మజా...’

‘కిరణ్! ఆ టాపిక్ వదిలెయ్. అసలు సుల్తాన్ గురించి నీకెందుకు? నీ గురించి నువ్వు చెప్పు’

‘నా గురించి నీకు తెలియనివి అడుగు పద్మజా. మావాళ్లు నా మాట కాదనరు. గుంటూరు నుంచి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయ్యాక అక్కడి ఇల్లు, పొలం అమ్మేసి ఇక్కడే ఇల్లు కొన్నాడు నాన్న. నేనొక్కన్నే కొడుకును. ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లయిపోయాయ్. నాకు ఇప్పుడంటే ఇప్పుడు పెళ్లి చెయ్యడానికి మా నాన్న సిద్ధంగున్నాడు. నువ్వు ఓకె అంటే ఎప్పుడు రమ్మంటే అప్పుడు మావాళ్లు మీ ఇంటికి వస్తానికి రెడీగా ఉన్నారు...’

‘కిరణ్! ఇంతదాకా పెళ్లి గురించే ఆలోచన చెయ్యలేదు. ఇంత సడెన్‌గా ఇబ్బంది పెట్టేస్తున్నావ్ నువ్వు. కనీసం వారం రోజులైనా టైం కావాలి కిరణ్. ప్లీజ్!’

‘తప్పదా’

‘తప్పదు’

☯ ☯

*“నా ఇష్టాన్ని నువ్వు ప్రేమంటావో..*
*కామం అంటావో.. మరోటంటావో..*

నాకు ఇవన్నీ ఉత్తుత్త మాటల్లా వినిపిస్తుంటాయ్
అర్థాలు కోల్పోయిన పదాల్లా
నిన్ను చూడగానే నాలో ఏవేవో తంత్రులు మీటిన సవ్వడులు
అవి నీలోనూ సంచలిస్తే
మనం తంత్రీ స్వర తరంగాల్లా కలిసిపోదాం..
ఎవరి నమ్మకాల కోసమో
పందిట్లో వేశాలు కట్టి నటించొద్దు
స్వచ్ఛతకు ముళ్లేసి మలినం చెయ్యొద్దు
కుంచించుకుపోయిన జడపదాల్లోకి
మనల్ని కుదించుకోవడమెందుకు?
మన నేలనూ ఆకాశాన్నీ
ఇరుకిరుకు గదుల్లోకి సర్దడం నాకిష్టం లేదు
కాదంటే ఈ లోకం మనల్నేం చెయ్యగలదు చెప్పు
చీకట్లోకి తోయడం తప్ప
చీకటి నాకు కొత్త కాదు
నువ్వు సరేనంటే
ఎంతటి చీకటినైనా ఎదిరించడానికి నేను సిద్ధమే
రా... నాతో !
గోడలూ మేడలూ లేని
ఈ నల్లని ఆకాశంలోకి
చూడు! ఎంత చిమ్మని చీకటో..
ఏ కల్మషాలూ లేని చీకటి
ఏ వ్యత్యాసాలూ చూపని చీకటి
ఈ చీకట్లో నువ్వూ నేనే
సూర్య చంద్రులం !!”

గట్టిగ చప్పట్లు కొట్టింది పద్మజ, ‘వాహ్! చాలా బాగుంది..’ అంటూ తన్మయంగా సుల్తాన్‌ని హత్తుకుపోయింది పద్మజ..! సుల్తాన్ కలా.. నిజమా.. అనుకుంటూ ఒళ్లంతా షాక్‌తో పద్మజను అల్లుకుపోయాడు.. అట్లా ఎంతసేపు గడిచిందో తెలియదు.. ఒకరి మొఖంపై ఒకరు ముద్దులు పెట్టుకున్నారు.. పెదవులు కలిసిపోయాయి.. తేరుకున్నాక– కొద్దిసేపు మౌనంగా ఉండిపోయారు..

'ఒక్కరోజులో రాసేశావా సుల్తాన్?'

'రాత్రంతా నిద్రెక్కడిది? అయినా పూర్తి సంతృప్తిగా రాలేదనుకో..'

'నువ్వు చెప్పాలనుకున్నది చెప్పేశావుగా.'

'హాఁ.. చెప్పేశాను కాని నువ్వు అర్థం చేసుకుంటావో లేదో–'

'ఎవరి నమ్మకాల కోసమో నటించాల్సిన పనిలేదు'లాంటి అభిప్రాయాలు బాగున్నాయ్. కాని ఇప్పుడున్న ఇష్టం.. ప్రేమ.. అదేదైనా ఎప్పటికీ అలాగే ఉంటాయని నమ్మకం ఏంటి సుల్తాన్?'

'నిజమే! అందరికి ఉండకపోవచ్చు'

'మరలాంటప్పుడు ఎట్లా కలిసుంటారు?'

'విడిపోకుండా ఉండడానికే కదా సమాజం షాదీ– పెళ్లి, దానికి కొన్ని రీతిరివాజులు పెట్టింది'

'అంటే ఇష్టం పోయినా కలిసుండాల్సిందేనా?'

'సంఘం అట్లా ఖరారు చేస్తోంది'

'నువ్వేమంటావ్?'

'ఇష్టం లేకపోతే కలిసుండడమెందుకు అని నాకనిపిస్తుందనుకో..'

'అంటె నువ్వు చేసుకునే అమ్మాయిమీద ఇష్టంపోతె వదిలేస్తావా?'

'అసలు అలా పొయ్యేది ఇష్టం కాదు, ఆకర్షణ కాదా?'

'ఓ.. సరె, ఒకవేళ ఆ ఆకర్షణే పోతే..?'

'నేను ఆకర్షణ స్థితిని దాటేసి ఇష్టపడుతున్నాను కాబట్టి అట్లా జరగదనుకుంటున్న'

'ఒకవేళ జరిగితే..?'

'ఒకవేళ' అంటే 'ఇప్పుడే చెప్పలేను' అనే చెప్పాల్సివస్తుంది'

'అంటే రాజీ పడవా'

'పెళ్లంటేనే పెద్ద రాజీ కదా?'

'నీతో ఇదే ఇబ్బంది. ఏదీ తేల్చి చెప్పవు. స్థిరమైన నిర్ణయానికి రావు'

'అట్లా నటించడమే, అబద్ధాలాడడమే నాకు రాదు. ఎప్పటి నిర్ణయమో ఇప్పుడే ఎలా తేల్చి చెప్పమంటావ్? చేసుకునే అమ్మాయినిబట్టి, ఆమె వ్యక్తిత్వాన్నిబట్టి నిర్ణయం ఆధారపడి ఉంటుంది కదా..'

'.. ఒకవేళ ఇద్దరిలో ఒకరికి ఇష్టం పోతుందనుకుందాం, మరొకరికి అట్లాగే ఉంటుంది. అలాంటప్పుడు ఇష్టంపోయిన వ్యక్తి విడిపోవాలని, ఉన్న వ్యక్తి కలిసుండాలని అనుకుంటుంటారు కదా. మరలాంటి పరిస్థితిలో పరిష్కారం ఏమిటంటావ్?'

'ఇది కొంచెం చిక్కు ప్రశ్నే.. ఊఁ.. కలిసుండాలనుకునే వ్యక్తి ఏదో ఒక మేరకు రాజీపడక తప్పదేమో..'

'ఎలాంటి రాజీ?'

'అది వాళ్ల వాళ్ల సమస్యలనుబట్టి ఉంటుంది కదా'

'ఇష్టం పోయిన వ్యక్తి స్థానంలో నువ్వుంటే ఏం చేస్తావ్ సుల్తాన్?'

'అదిగో, మళ్లీ అలాంటి ప్రశ్నే! ఇప్పుడే ఎలా చెప్పమంటావ్?'

'చెప్పాల్సిందే! నాక్కావాలి'

'ఊఁ.. చెప్తాను కాని.. ఇదే పూర్తిగా కరెక్ట్ కాకపోవచ్చు. అప్పటి పరిస్థితి, ఇద్దరి మధ్య అవగాహన, ఇబ్బందులు, రాజీకి రాలేని సమస్యలు నిర్దేశించవచ్చు. నా మటుకు నేను మాత్రం స్త్రీగా ఆమె గురించి ఆలోచిస్తాను. ఈ పురుషస్వామ్య వ్యవస్థలో భర్త 'వదిలేసిన' స్త్రీగా ఆమె కెదురయ్యే చిన్నచూపును, సమస్యల్ని ఆమె ఎదుర్కోగలదా? మొత్తంగా ఆ సంక్షోభాన్ని తట్టుకొని ఆమె నిలదొక్కుకోగలదా అని ఆలోచిస్తాను'

'ఒకవేళ ఆమె తట్టుకోలేదనుకుంటే నువ్వే రాజీ పడతావన్నమాట!'

'అబ్బాహ్! విసుగ్గా ఉంది పద్మజా, ఇంకా కంటిన్యూ చెయ్యాలంటే!

'లేదు, చెప్పు చెప్పు! అట్లా రాజీ పడినప్పుడెలా ఉంటుందంటావ్?'

'ఏముంటుంది, విసుక్కోవడాలు, కోప్పడడాలు, కొట్టుకోవడాలు.. చూస్తున్నదేగా లోకం నిండా'

'ప్చ్! ఏంటో, అంతా అయోమయం.. ఒకవేళ మతాలు వేరయినవాళ్లు చేసుకుంటే ఏమైనా ప్రత్యేకమైన ఇబ్బందులుంటాయా సుల్తాన్..!'

'ఉంటాయి కదా! చూస్తలేమా.. మగస్వాముల వ్యవస్థ కాబట్టి మగాళ్ల పెత్తనమే కొనసాగుతోంది! మగవాడు ఏ మతంవాడైతే ఆ మతమే ఆడవాళ్లమీద రుద్దబడుతోంది'

'రుద్దబడుతోందని ఎందుకనుకోవాలి, వాళ్ల ఇష్టంమీదనే, ప్రేమికుడి మీది ప్రేమతోనే అతని మతం స్వీకరిస్తున్నారని కూడా అనుకోవచ్చు కదా'

'హుఁ! ప్రేమ పేరుతో కూడ సంస్కృతుల దోపిడీ..!'

'అంటే..'

'కాదు పద్మజా! నీకెందుకు అర్థం కాదు, ఎవరి మత ఆచారాల్ని, జీవన శైలిని వాళ్లు ఎందుకు వదులుకోవాలి?? ఒకరు ఇంకొకరి మతాచారాల్ని ఎందుకు గౌరవించుకోకూడదు..'

'నువ్వు చెప్పేది నిజమే కాని అట్లా ఎవరూ ఆలోచించడం లేదు కదా..

'అదే, ఆలోచించాలి అంటున్నాను. మగవాళ్లు ఆలోచించకపోతే ఆడవాళ్లు ఫైట్ చెయ్యాలి కదా..'

'..ప్చ్! ఏం అర్థం కాట్లేదు... ఎటన్నా వెళ్దామా? ఔనూ ఒకసారి మీ ఇంటికి తీసుకెళ్తావా సుల్తాన్?'

'ఓ.. ఎప్పుడెళ్దాం? కాని నువ్వు ఇబ్బంది పడతావేమో..'

'ఇబ్బందెందుకు?'

'ఊఁ.. అయ్‌నా నీకు రావాలనిపిస్తే అవన్నీ ఆలోచించడం అనవసరం. చెప్పు, ఎప్పుడెళ్దాం?'

'ఇవాళే, ఇప్పుడే ఎందుకెళ్లకూడదు!'

'చలో..'

☯ ☯

ఆడ్నరి బస్సు దిగి(న్రిద్దరు.

'నువ్వు రోజూ ఇక్కడ్నించి వస్తావని అస్సలు ఊహించలేకపోతున్న. ఎంతదూరం ఇది'

'ఐదు కిలోమీటర్లు'

'ఎక్కడ మీ ఇల్లు'

'ఆ గల్లీలో ఆఖరి ఇల్లు'

–ఇల్లు తన ఊహల్ల అన్పించినట్లు లేకపొయ్యేసరికి కొద్దిగ పరేశానయ్యింది పద్మజ. ఒక గుడిసె. దాని పక్కన ఒక ఇటుకల అర్ర. ఆ అర్ర కట్టి శా(న్రోజులే అవుతున్నట్లనిపిస్తున్నా సిమెంట్ అస్త్రకారి చేసి లేదు.

'ఇది మా గూడు. ఈమె మా అమ్మ. పేరు చాంద్‌బేగం. తను మా పెద్ద చెల్లె–హసీనా. తను చిన్నచెల్లె–నస్రీన్. ఒక తమ్ముడున్నడు. స్కూల్‌కెళ్లాడు. హసీనా! ఇనూఁ పద్మజ బోల్కె మేరె క్లాస్‌మేట్. తుమార ఘర్ దేఖ్‌తిమ్ బోలెతో బులాకె లాయమ్. నస్రీన్! దూద్ హైతొ జర చాయ్ బనావ్‌నా!' అనుకుంట ఇంటెన్కకెల్లిండు మొఖం కడుక్కొచ్చుకుంటాన్కి.

నస్రీన్ హుషారుగ బల్లెపీట మీద ఉన్న వస్తువలు జరిపి సోజ్‌నీ ఏసి కూసొమన్నది. కూసున్నది పద్మజ. చుట్టు చూసింది.. అది చిన్న అర్ర. అందుల్నె ఒక బల్లెపీట. ఒక కుట్టుమిషిన్. ఒకమూల పెట్టెలు, సామాన్ అంతా సర్ది ఉన్నది. గోడకు మక్కా మదీనా పటాలు వేలాడేసి ఉన్నయ్. దాని కిందనె ఉన్న సెల్ఫ్‌ల మడిచిపెట్టిన రెహాల్, జానిమాజ్, దాని పక్కన ఖురాన్ ఉన్నై. ఇల్లంతా ఎ(రమట్టితోని అలికి ఉంది. పద్మజకు నోటమాట వస్తలె. మొఖంల బలవంతంగ నవ్వు పులుముకొని కూసున్నది. పక్కన హసీనా కూసుంది. సుల్తాన్ వాళ్లమ్మ గనుమల కూసుంట 'మీది నల్గొండేనా?' అనడిగింది. అవునన్నట్లు తల మాత్రం ఊపింది పద్మజ. నస్రీన్ చాయ్ చేస్తానికేమో గుడిసెలకు పొయింది.

హసీనా, చాంద్‌బేగం అదొ ఇదొ మాట్లాడిస్తున్రు. సుల్తానొచ్చి మొఖం కడుక్కుంటవా అనడిగిండు. కడుక్కోనని చెప్పింది పద్మజ. తువాల్‌తోని మొఖం తుడుసుకుంట సుల్తాన్ గుడ బల్లెపీట ఆఖర్న కూసుండు. హసీనా పెట్టెల్నించి ఒక పాత ఆల్బం తీసి పద్మజ చేతికిచ్చింది. పద్మజ తిరిగేస్తుంటె ఆ ఫోటోల్ల ఉన్నదెవరొ చెప్పబట్టింది. అందుల ఉన్న సుల్తాన్ ఫోటోల్ల సుల్తాన్ బలె అందంగ ఉండు. సుల్తాన్‌ది ఫోటొజెనిక్ ఫేస్ అనుకున్నది పద్మజ. మల్లమల్ల సూడాలన్పించింది ఆ ఫోటొల్ని. సుల్తాన్ చుట్టాల ఫోటోల్ల చాలా వరకు మగవాళ్లయితె టోపీ గడ్డాలతోని, ఆడవాళ్లేమొ కొంగు కప్పుకోని కొందరు, చాలామంది చమ్కీల చీరలు–మెరుపుల బట్టలు తొడుక్కొని దిగిన ఫోటోలున్నయ్. పెల్లి కాని అమ్మాయిలు కొందరేమొ బాగా లిప్‌స్టిక్ పెట్టుకొని, పౌడర్ తెల్లగ పెట్టుకొని దిగిన్రు.. మజ్జెల సుల్తాన్ వాళ్లమ్మీ లేషి ఎటో ఎల్లిపోయింది. నస్రీన్ చాయ్‌లు తెచ్చి ఇచ్చింది.

..ఆ ఇల్లు, ఆ వాతావరణం చూసి లోపల్లోపల షానా పరేశానయ్యింది పద్మజ. అద్దగంట పైన ఉండి ఇగ ఎల్తనన్నది. హసీనాకు, నస్రీన్‌కు పొయ్యొస్తనని చెప్పింది.

'బస్ చడాకె ఆతమ్' అని సుల్తాన్ కదిలిండు. ఇద్దరు గల్లీల నడుస్తున్నరు.

'మీ నాయ్న ఏం చేస్తడు సుల్తాన్?'

'లారీ డ్రైవర్!'

'మరి మీ ఇల్లు నడవడం, నువ్వు చదువుకోవడం కష్టం కాట్లేదా సుల్తాన్?' పద్మజ కళ్లల్ల సన్నటి కన్నీటి పొర కదలాడింది. సుల్తాన్ నవ్విండు. ఇద్దరు రోడ్డు మీదికొచ్చిన్రు. బస్టాప్‌కు పక్కనున్న ఒక పాన్‌డబ్బా చూపెట్టిండు,

'ఇది మాదే పద్మజా! నేను కాలేజ్‌నుంచి రాంగనే తీస్త. ఉదయంపూట మా అమ్మీ తీస్తుంది...

పద్మజ పరేశానయ్యింది. నోటమాట రాలె.

అంతల బస్సొచ్చింది...

3

'డ్రైవర్! కారాపు!' అన్నది పద్మజ ఆత్రంగ. కార్ సడెన్‌గ ఆగిపోయింది.

'వెనక్కి పోనీ' అన్నది అద్దం మొత్తం కిందికి దించుకుంట.

'ఆపేసెయ్' అన్నది. కారాగింది. ఎన్కనుంచి నడిచొస్తున్న మనిషి దగ్గర్కి రాంగనె 'సుల్తాన్!' అన్నది పద్మజ. అతను ఎవరన్నట్లు చూస్తు ఆగిపొయ్యిండు.

మామూలు ప్యాంట్ షర్ట్, కాళ్లకు స్లిప్పర్లు, భుజానికి బ్యాగ్.. ఇంత సాదాసీదాగ ఉన్నాడేందీ మనిషి అనుకుంట పద్మజ డోర్ తెర్సుకొని కారుల్నుంచి దిగింది.

'హాయ్ పద్మజ!' అన్నడు సుల్తాన్.

మరింత పరేశానయ్యింది పద్మజ. అరె! తానొక ఖరీదైన కారులోంచి దిగింది; ఖరీదైన చీర, ఒంటినిండా విలువైన నగలు,.. ఏమాత్రం ఆశ్చర్యపోలేదేమిటీ మనిషి!

పైగా ఆరేళ్ల తర్వాత కూడ చూసిన వెంటనే గుర్తుపట్టేసి, ఏమాత్రం తొణకకుండా ఆరేళ్ల క్రితంలాగే హాయ్ చెప్పగలగడం, అదీ ఏకవచనంలోనే.. ఎలా సాధ్యం?

'ఏంది! నన్ను నిలబెట్టేసి నువ్వేవొ గ్యాపకాల్లకు ఎల్లిపొయ్‌నట్లుంది'

'హాఁ ! నిన్ను చూడగానే ఎటో వెళ్లిపోయాను. బాగున్నావా సుల్తాన్?'

'ఇగొ.. ఇట్లా ఉన్న!'

'కారెక్కుతావా, వెళ్తూ మాట్లాడుకుందాం'

'ఊఁ.. నేను ఒక దోస్తును కలుస్తాన్కి పోతున్న. ఇప్పటికె టైం అయ్‌పొయింది. ఈ రోడ్ ఆఖర్ల దిగిపోత. పర్వాలేదుగ'

'సరె, ఎక్కు.. డ్రైవర్, పోనియ్ ..ఇన్నేళ్లకు మళ్లీ నువ్వు కన్పించడం.. నాకు చాలా సంతోషంగా ఉంది సుల్తాన్! ఏం చేస్తున్నావ్ నువ్వు?'

'ముస్లింల గురించి పనిచేస్తున్న'

'ముస్లింల గురించా? అప్పుడేమో పేదలు, పీడితులనేవాడివి?!'

'ఇప్పుడు ముస్లింలు పీడితులు, పేదలేగా! పైంగ వేలు వేలు చంపబడుతున్రుగదా'

'... అవున్లే! సరెగాని ఎక్కడుంటున్నావు నువ్వు?'

'దిల్‌సుఖ్‌నగర్ల ఉంటున్న'

'మేం బంజారాహిల్స్‌లో ఉంటున్నాం. ఒకరోజు నువ్వు అక్కడ్నించి వెళ్తూ కన్పించావ్. పిలిచేలోగా రోడ్ మలుపు తిరిగినట్లున్నావు..'

'అట్లనా! డ్రైవర్! ఆ గల్లీకాడ ఆపు. పద్మజ! మల్ల కలుద్దాం'

'ఎప్పుడు కలుద్దాం? ఏం మాట్లాడినట్లే లేదు.. రేపు వీలవుతుందా సుల్తాన్'

'ఆఁ. యాడ కలుద్దాం'

'రేపు మధ్యాహ్నం, ఎక్కడైనా'

'ఎన్ని గంటలకో చెప్తె నేను అగొ ఆ బస్టాప్‌ల నిలబడి ఉంట'

'2 ఒ క్లాక్'

'సరె'

'తప్పకుండా కలుస్తావ్ కదా?'

'తప్పకుంట'

'ఓ.కె. థ్యాంక్యూ సుల్తాన్. బాయ్'

☯ ☯

సిటీ బస్ దిగిండు సుల్తాన్. రెండున్నర కావొస్తుంది. పద్మజ కారు కొంచెం ముందల రోడ్డు పక్కన ఆగి ఉంది. కారు దగ్గర్కి పొయిండు. డ్రైవింగ్ సీట్లో కూసొనున్న పద్మజ, 'హాయ్ సుల్తాన్' అనుకుంట ఎంతో సంతోషంగ అటేపు డోర్ తెరిచింది.

'హలో' అంటు ఆమె పక్కన కూసొని డోర్ ఏసిండు సుల్తాన్.

'నువ్వు రావేమో అని ఒకటే దిగులేసింది. 15 నిమిషాలు ముందే వచ్చాను. ఇంతసేపు ఎంత కష్టంగా గడిచిందో.. చెప్పు! ఎక్కడికెళ్దాం?' కారు స్టార్ట్ చేస్కుంట అన్నది పద్మజ హుషారొచ్చినదాన్లా.

'నీ ఇష్టం'

'నువ్వు చెప్పు. ఏదేని హోటల్ కెళ్దామా? పార్క్ కెళ్దామా?'

'ముందుగాల చెరొక ఇరానీ చాయ్ తాగుదం. ఐటెంక ఏదన్న పార్కుకెల్దమంటె ఎల్దాం. లేకుంటె హోటల్లనె కూసుని తాగాలన్పించినప్పుడల్ల ఒగ చాయ్ తాక్కుంట మాట్లాడుకోవచ్చుగా!'

'నీ భాషలో ఏదో మార్పొచ్చిందేంటి సుల్తాన్?'

'తెలంగాణ కాన్షస్‌నెస్ !'

'ఓహో.. బాగుంది! తెలంగాణ వస్తుందంటావా?'

'తప్పకుంట'

'వస్తె మంచిదేలే.. సంజీవయ్య పార్క్‌కెళ్దామా. టీ అక్కడే తాగుదాం. బయట కొంచెం ఇబ్బంది కదా నాకు..'

'సరె, పోనీ..'

☯ ☯

'ఈ రోజు నీతో చాలా విషయాలు మాట్లాడాలి సుల్తాన్. నాకెంత ఉద్వేగంగా ఉందంటే.. చెప్పలేను. ఎక్కడలేని సంతోషంగా కూడా ఉంది. మొన్న నువ్వు కన్పించినరోజు షాక్ తిన్నట్లయింది. నిన్న నువ్వు కనబడేసరికి ప్రాణం లేచివచ్చింది. రాత్రి నిద్ర పట్టలేదు. నీ గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. అప్పటి మన కాలేజ్ జ్ఞాపకాలు చంపేశాయి. ఇప్పుడు చెప్పు, నువ్వు అప్పుడు ఎగ్జామ్స్ ఎందుకు రాయలేదు? నా గుండె పగిలిపోయింది తెల్సా! ఎగ్జామ్ ఉన్న ప్రతిరోజూ నీ నెంబర్ వేసి ఉన్న ఖాళీ కుర్చీని చూసి తట్టుకోలేకపోయాను. చివరిరోజు బాగా ఏడుపొచ్చింది. ఎట్లాగైనా ఒకసారి మీ ఊరికొచ్చి నిన్ను కలిసి రావాలనిపించింది. కాని మావాళ్లు నన్నసలు మెసలనివ్వలేదు. ఎగ్జామ్స్‌కి ముందు ఎంగేజ్ మెంట్ ఘనంగా చేశారు. ఎగ్జామ్స్ అయిపోగానే మ్యారేజ్. కనీసం నీకు వెడ్డింగ్‌కార్డు కూడా ఇవ్వలేకపోయాను. కిరణ్‌కి రెండుమూడుసార్లు చెప్పానుకకూడా. వాడు వచ్చి ఒకసారి కలవొచ్చు కదా అన్నాడొకసారి కోపంగా. చెప్పు సుల్తాన్! నువ్వెందుకు ఒక్కసారన్నా అటువైపు రాలేదు. అసలు ఎగ్జామ్స్ ఎందుకు రాయలేదు చెప్పు'

'హుం ! ..రాయాలన్పించలె. అంతె !'

'అదె, ఎందుకనిపించలేదు?'

'కొన్ని అన్పించడాలకు కారణాలుండవ్ పద్మజ!'

'నువ్వు స్పష్టంగా మాట్లాడడం లేదు సుల్తాన్. అన్పించింది అన్పించినట్లు మాట్లాడడమే నీకు తెల్సని అనేవాడివి కదా. ఇప్పుడేమైనా మారిపోయావా?'

'..నీకు నిజం తెల్సుకోవాల్నని ఇంట్రస్టుగ ఉండొచ్చు. అందుల నీ పాత్ర ఉందేమోనన్న ఆసక్తి కావొచ్చు. కాని నేను ఎగ్జామ్స్ రాయకుంట ఉంటానికి కారణం నా మనస్తత్వమె అనుకుంటున్న. నీ మ్యారేజ్ అని తెల్సినంక షానా నిరుత్సాహానికి గురయిన. నీతో చెప్పలేకపోయిన గని నేను ఎప్పట్నించో నిన్ను చాలా ఇష్టపడేవాణ్ని. సభల్లో, సమావేశాల్లో నిన్నే చూస్తుండిపోయేవాణ్ని. నీ ప్రతీ కదలికా, నీ నవ్వూ, మనం ఆరోజు అల్లుకుపోయి పెట్టుకున్న ముద్దులూ, అన్నీ అన్నీ నన్ను క్షణం క్షణం యాదికొచ్చి చంపేసేవి.. నేనెలా బతకాలనుకున్నానో అలా బతుకుతూ వస్తున్నవాణ్ని. ఒక్క నీ విషయంలోనే ఓటమి పాలయ్యాను.. అది తట్టుకోవటం షానా కష్టమైంది.. నీతోని కల్సి తిరిగిన ఆ కాలేజ్ ఆవరణలకు మల్ల అడుగుపెట్ట బుద్ధి కాలె. ఆ యాది అట్లనె ఉండాలన్పించింది...'

'..అయితె నువ్వు మళ్లీ ఎగ్జామ్స్ రాయనె లేదా?!'

'రాయలె. అక్కడితోని చదువు వొదిలేసినట్లె !'

'..కనీసం ఒక్కసారయినా మా ఇంటివైపుగాని, కిరణ్ దగ్గరికిగాని రాలేదెందుకు?'

'రావాలన్పించలె. వస్తె నేనిబ్బంది పడాలె, మిమ్మల్ని గుడ ఇబ్బంది పెట్టినట్లవుద్దన్పిచ్చింది'

'..నాకు నిన్ను చూడాలనో మాట్లాడాలనో అన్పిస్తుండొచ్చు అని ఒక్కసారన్నా అన్పించలేదా సుల్తాన్?' పద్మజ గొంతు పూడుకుపోయింది.

'అంత బలంగ అన్పిస్తె నువ్వే వస్తవు గద అని ఎదురుచూసిన'

'నిజంగానా?!'

'ఒక్కసారన్న తప్పకుంట వొచ్చిపోతవనుకున్న. వెడ్డింగ్ కార్డ్ ఇస్తానికైనా వస్తవుగదా అని శానా ఎదురుచూసిన'

'అస్సలు నన్ను ఇంట్లోనుంచి కదలనివ్వలేదు సుల్తాన్'

'మనం కదలాలనుకుంటె అదేమంత పెద్ద కష్టం కాదనుకుంట'

'అంతేనంటావా! ..వెడ్డింగ్ కార్డ్ నీకు పోస్ట్ చేశానన్నాడు కిరణ్'

'నాకు రాలె'

'రాలేదా?! అంటె కిరణ్ పోస్ట్ చేయలేదా?'

'..........'

'మ్యారేజ్‌కి ముందు నేను చాలా సందిగ్ధంలో పడిపోయాను సుల్తాన్. నీతో స్పష్టంగా కొన్ని విషయాలు మాట్లాడా లనిపించింది. మీ ఇంటికొచ్చి వెళ్లినరోజు

బాగా డిస్టర్బ్ అయ్యాను. నా మనసు నీవైపు మొగ్గు చూపుతున్నా మీ ఇంటి వాతావరణం చూశాక చాలా భయమేసింది, ఆ ఇంట్లో నేను ఇమడగలనా అని. దానికి రాజీ పడినా మీ ఆర్థిక పరిస్థితిని చూశాక అవసరమైతే వెంటనే నువ్వు నన్ను మ్యారేజ్ చేసుకోవడం కూడా కష్టమనిపించింది. అదీకాక నీ మాటల్లో నాకు ఎప్పుడూ భద్రత కన్పించేది కాదు. ఆ ఏజ్‌లో పెళ్లి గురించి ఆలోచించే ప్రతి అమ్మాయి భద్రత గురించే ఎక్కువగా ఆలోచిస్తుందేమో. అయినా నా మనసు చివరిసారిగా నిన్నొకసారి కలిసి నీ నిర్ణయం తెలుసుకోవాలని ఆరాటపడింది...

అదే విషయం మా ఇంట్లో చెప్పాను. పెద్ద గొడవైంది. షాక్‌కు గురయ్యాను. ఎందుకంటే మా అమ్మానాన్నది లవ్‌మ్యారేజే. అర్థం చేసుకుంటారనుకున్నాను. కాని ఇద్దరూ కూడ నువ్వొక ముస్లింను చేసుకుంటానంటే మేమిద్దరం ఉరిపెట్టుకుని చస్తామని బెదిరించారు. ఎన్ని మాటలన్నారో.. నా మనసూ, మెదడూ మొద్దుబారిపోయాయి.. అదికాక కిరణ్‌ది, మాదీ ఒకే కులం కావడం, కిరణ్‌వాళ్లు కట్నం ఎక్కువగా డిమాండ్ చెయ్యకపోవడంతో మా నాన్న పట్టుపట్టి అందర్నీ ఒప్పించి అంత తొందరగా మ్యారేజ్ చేసేశాడు. దానికి తోడు కిరణ్ కూడా అనుక్షణం నన్ను కనిపెడుతూ, జాగ్రత్తపడుతూ వచ్చాడు. క్రమంగా నేను అటు మొగ్గిపోయాను. అటువైపు ఏ లోటూ కన్పించకపోవడం, ఏ ఇబ్బందులు ఎదురుకావనే భరోసా కన్పిస్తుండడం, 'భద్రమైన జీవితం' నన్ను లోబర్చుకుంది. కానీ...'

'ఊఁ.. 'కానీ'..? ఆగిపొయ్‌నవెందుకు, చెప్పు! నాగ్గూడ ఇనాలనుంది'

'కానీ.. నా మనసులోంచి మాత్రం నువ్వు చెదిరిపోలేదు సుల్తాన్. ఎన్నోసార్లు నీ గురించి ఆలోచిస్తూ ఉండిపొయ్యేదాన్ని. మన క్లాస్‌మేట్స్ ఎవ్వరు కలిసినా నీ గురించి అడిగేదాన్ని. నీ గురించేమి తెలియదనే చెప్పేవాళ్లు అంతా. నాలుగైదునెల్ల క్రితం నవీన్ మాత్రం నువ్వు హైద్రాబాద్‌లోనే ఉంటున్నావని చెప్పాడు.. నిన్నొక్కసారైనా చూడాలని ఎంతగా అనిపించేదో...' కళ్లు తుడుచుకున్నది పద్మజ.

'..నీ గ్యాపకాలు నన్నెంతగనమో చంపేసినయ్ పద్మజా..! తట్టుకోలేక ఒంటరిగ ఏడ్చుకునేవాన్ని' బాధగ చెప్పిండు సుల్తాన్. అతని కళ్లల్ల నీళ్లు సుడులు తిరుగుతున్నయ్..

'... ... ...'

'... ... ...'

'మ్యారేజ్ చేసుకున్నావా సుల్తాన్?'

'చేసుకోలె'

'చేసుకోలేదా?! ఎందుకని?'

'నాకు 'సాంప్రదాయిక', 'సాంసారిక' జిందగీమీద ఇంట్రస్ట్ లేదు. ఈ దొంగ విలువల్ని బద్దలు కొట్టాలె. నా కిష్టమైన కవిత్వం, సాహిత్యమె జిందగీగ నాదంటూ

ఒక లైఫ్‌స్టైల్ ఏర్పర్చుకుంటున్న. సరె, ఇవన్నీ నీకు గజిబిజిగ అన్పిస్తయ్‌గని, ఇంక చెప్పు, కిరణ్ ఎట్లుండు? మీ ఇద్దరి లైఫ్ ఎట్లుంది?'

'అహఁ.. ముందు నువ్విది చెప్పు, పెళ్లి చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండడం ఎట్లా సాధ్యం?'

'బ్రహ్మచారిగ ఉంటున్నని అన్లేగద! సలీమా అనే ఒక అమ్మాయి, నేను సహచరులుగ ఉంటున్నం. కాకపోతే ఎవరి రూంల వాళ్లుంటం. కలవాలనిపించినప్పుడు కలుస్తం'

'ఎందుకట్లా?!'

'మా మధ్య ప్రేమ మాత్రమే ఉండాలనుకుంటున్నం. అధికారం ఉండకూడదనుకున్నం. ఒకరి ఇష్టాల్ని మరొకరు ఏమాత్రం డిస్టర్బ్ చెయ్యకూడదని..'

'ప్రేమతో కూడిన అధికారంలో ఆనందం కూడ ఉంటుంది కదా సుల్తాన్?'

'అదే మనల్ని మెల్లమెల్లగ బంధించేస్తుంది. ఆఖరికి ప్రేమ పూర్తిగ మాయమై అధికారమే మిగుల్తుంది'

'మరి మీకు పిల్లలు కలిగితే?!'

'ఇప్పటికైతె వద్దనుకుంటున్నం. ఇద్దర్కి కావాలన్పించినప్పుడు, ఇద్దరం పిల్లల గురించి సమానంగ పట్టించుకోగలం అనుకున్నప్పుడు కంటం..'

'మరి ఇల్లులాంటిదేమీ..?'

'నాకు ఇల్లెందుకు పద్మజా! నాలాంటోళ్లు ఇల్లుగూడ కట్టుకోగలుగుతరా? అయ్‌నా దునియల ఎంతమందికి ఇండ్లున్నయని? ఒక అద్దరాతిరి తిరిగి చూడు, ఈ షహర్ ఫుట్‌పాత్‌లపై ఎన్ని వేలమంది పండుకొనుంటరో! ఊర్లల్లకెల్లి చూడు, ఎన్ని కుటుంబాలకు కాళ్లు బార్లా చాపుకొని పండుకుంటానిగ్గూడ సోటుండదో! నిలువ నీడగుడ లేకుంట ఎంతమంది జనం అల్లాడుతుంటరో మనం ఎన్నడు పట్టించుకున్నమని..'

'అది నిజమేగాని ఇళ్లు లేకపోవడం అనేది డబ్బులు లేనోళ్ల సంగతి. నీకు డబ్బుల్లేక ఇల్లు కట్టుకోవడం లేదంటున్నావా?'

'అట్ల కాదులె, నాకు సొంతానికి ఏదీ ఉండడం ఇష్టంలేదు. అసలు నా శరీరం మీద నాకే హక్కు ఉండకూడదనుకుంటున్న. నాకు సూఫీ సెయింట్సన్నా, సూఫీయిజమన్నా ఇష్టం. అట్లా బతకాలని ఉంటుంది! సరెగని, నీ గురించి చెప్పు, కిరణ్ ఎట్లున్నడంటె చెప్పనె లేదు"

'కిరణ్ కేమైంది, బాగానే ఉన్నాడు. ఉద్యోగం, బిజినెస్.. ఇంటికొచ్చినా అదే ఆలోచన. మాకో బాబు. వాడి గురించంతా నేనే పట్టించుకోవాలి. సెలవు దినాల్లోనైనా మాతో గడపమంటే, బీరువాలోంచి నీక్కావాల్సిన డబ్బు తీస్కెళ్లు, ఎంతైనా ఖర్చు

చెయ్యి. కాని ఇంకొన్నాళ్లు నన్ను వదిలెయ్ పద్మజా. ఇంకా నాలుగైదేళ్లు కష్టపడ్డానంటే తర్వాత కూర్చుని తినొచ్చు అంటాడు. నాకేమో బోర్ కొట్టి చస్తున్నా. మామూలు మగవాడిలాగే పెత్తనం చెలాయిస్తాడు. ఎన్నోసార్లు గొడవపడ్డాం. ఒక్కోసారి ఎంత అసహనంగా, ఎంత అసంతృప్తిగా ఉంటుందంటే.. చెప్పలేను'

'నువ్వెందుకు ఊరికె ఉండటం, ఏదన్న జాబ్ చెయ్యొచ్చుగా?'

'కిరణ్ కిష్టం లేదు. అందుకే ఊరుకున్నాను'

'పాటలు బాగ పాడేదానివి గద పద్మజా! గాత్రం నేర్చుకుంటుంటివిగా?'

'నేర్చుకున్నాను. పెళ్లయినాక కూడ నేర్చుకుంటుంటే ఏమీ అనలేదు. తర్వాత కొన్ని ప్రోగ్రామ్స్ కూడా ఇచ్చాను. అది కూడ ఇష్టంలేదని అర్థమై వదిలేశాను'

'హుఁ.. తమ ఇష్టాలన్నింటిని అట్లెట్ల వదిలేస్కుంటరు ఈ మనుషులు? ఒంటినిండా ఈ సొమ్ములేంది? అప్పుడు ఇష్టపడేదానివి కాదుగా?'

'ఊఁ ! ఏంటో ఒక్కొక్కటి అన్నీ అలవాటైపోయాయ్'

'ఔ, దునియాఁకి కావల్సినట్లు మారిపోతె ఏ పరేశాని ఉండదు కదూ.. అప్పుడెంత రెబల్‌గా కన్పించేదానివో. ఇప్పుడిట్లా పురుషస్వామ్యం ఉచ్చుల పడిపొయ్‌నవ్. ఒంటినిండా నగలు.. అంత పొడుగు ఆ జడ.. ఆ గాజులు.. మొత్తానికి అందరు ఆడోళ్లలెక్కనె సొమ్ములు, సౌందర్య పోషణల పడిపొయ్‌నవా?'

'లేదు సుల్తాన్! ఇవన్నీ నాకిష్టముండి చేయడంలేదు. నాకు వీటి వేటిమీద ఇంట్రస్ట్ లేదు'

'అంతేలే.. అనవసరంగ ఫైట్ చేసి కష్టాలు కొని తెచ్చుకోవడమెందుకని ఆలోచించే చాలామంది ఆడవాళ్లలెక్కనె నువ్వు గుడ తయారవడం బాదగుంది. అప్పట్లో నీ ఆలోచనల్నీ నిన్నూ చూస్తే ఎంత ఆశగా ఉండేదో.. చాలా మందికి నువ్వు ఒక మోడల్ అవుతావని ఆశపడేటోన్ని. హుఁ ..జీవిత భద్రత! అవున్లే నీలెక్కనె ఇప్పుడందరు అదే ఆలోచిస్తున్రు. సాటి ఆడోళ్లు ఎన్ని బాధలు పడుతున్నా; ఇష్టాల్ని, కోరికల్ని అణుచుకొని, చంపుకొని హిస్టీరియా రోగులయ్యో, హృద్రోగులయ్యో బలైపోతున్నా నీలాంటివాళ్లు తమ సుఖం తాము చూసుకుంట హాయిగా తమ శేషజీవితం చాలిస్తుంటరు..'

'సుల్తాన్! నేను మాత్రం హాయిగా ఉన్ననని ఎందు కనుకుంటున్నవ్. ఇప్పటికే తల పగిలిపోతోంది. ఇంకా మనసు మెలిపెట్టకు. నేనిదంతా ఆలోచించకుండా ఏంలేను సుల్తాన్. కాని ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు'

'ఒట్టిగ ఆలోచిస్తె సరిపోతదా? నీలాంటివాళ్లకు ఇష్టమైన మనుషులు వేరే ఉంటరు. ఇష్టమైన పనులు, కళలు వేరే ఉంటయ్. కాని చుట్టుపక్కల వాళ్లకోసమో, అమ్మానాన్నల కోసమో, సంఘంల గౌరవ మర్యాదలకోసమో ఇట్లా

బతుకులీడుస్తుంటరు! ఇంట్ల మొగనికి అన్నీ చేసిపెట్టుకుంట, వాడి వంశాన్ని నిలబెట్టాన్కి పిల్లల్ని కనిచ్చుకుంట, తనకంటూ ఒక వ్యక్తిత్వం, అస్తిత్వం ఏదీ లేకుండా బతికే ఒక మామూలు ఆడామెకూ నీకూ తేడా ఏంది చెప్పు?! ...' ... ...

☯ ☯

సలీమ రూం తలుపు కొడుతుంటే శానా ఇంట్రెస్టుగ ఉండింది పద్మజకు.

తలుపు తెరుచుకుంది– అంతే..

అట్లనె చూసుకుంట ఉండిపోయింది పద్మజ.

'అందర్ ఆవో!' అన్నది చిర్నవ్వుతోని సలీమ. దాంతో తేరుకొని తను కూడ నవ్వుతోని బదులిచ్చుకుంట లోపల్కి అడుగుపెట్టింది. మరింత పరేశానయ్యింది.. ఆ రూంల ఏం లెవ్వు, కింద ఒక పక్కగ దూది పరుపు, ఒక కుర్చీ, ఒక షెల్ఫుల కొన్ని పుస్తకాలు, చిన్న కిచెన్ రూంల కొన్ని వంటగిన్నెలు, కొంత సామాను..

'సలీమా! ఈమె పద్మజ!'

'.. ఓహ్! హలో! నేను సలీమ!' చేయి చాపింది సలీమ చిర్నవుతోని ఉత్సాహంగ.

'హలో!' పద్మజ ఇంక తేరుకోలె. ఆ పిల్లను చూస్తే షాకింగ్‌గ ఉందామెకు, ఇంత సింపుల్‌గానా అని యమ పరేశాన్‌గ ఉంది..

... కిందేసి ఉన్న పరుపుమీద కూసున్రు ముగ్గురు.

'నిన్న అనుకోకుంట రోడ్‌ల కలిసినం సలీమ్! నేను కొద్దిగ అర్జెన్సీల ఉండి ఇయాల కలుద్దామనుకున్నం. మనం అనుకున్న ఎన్నో సస్పెన్స్‌లకు జవాబ్‌లు దొరికినయ్. ఇప్పుడు తనకొక బాబు! నిన్ను చూడాలన్నది, తీసుకొచ్చిన'

'ఐసా! షానాసార్లు మీ గురించి చెప్పిండు సుల్తాన్. మీరు లేకుంట చాలా మాట్లాడుకున్నం. ఎన్నోసార్లు మిమ్మల్ని ఊహించుకోవడమే సరిపొయ్యేది నాకు. ఇయాల మిమ్మల్ని చూస్తున్నా.. ఖుషీగ ఉంది.. చాయ్ తాగుదామా?!'

'లేదులెండి, కొద్దిసేపటికి తాగుదాం. మీరు మాట్లాడుతూ ఉండండి.. మీరు మాట్లాడుతుంటే బాగుంది' అన్నది పద్మజ నవ్వి. నిజంగానే కాస్త నలుపులో, ముఖంలో ఏదో కళతో భలే హుషారుగా ఉందనిపించింది సలీమా పద్మజకు. 'మగవాళ్లలాగే' కటింగ్ చేయించుకొని సింపుల్‌గా దువ్వుకుంది. కాలర్ ఉన్న ఖమీజ్, సెల్వార్ వేసుకుంది. అందుకు కూడ కొంత బాగనిపిస్తున్నట్లుంది. చెవుల రింగులుగాని, ముక్కు పుడకగాని, మెడలో, చేతులకు, కాళ్లకు ఏమీ లేవు.. భలే ఆశ్చర్యం, ఏమీ లేకుండా కూడా ఎంత ఆకర్షణీయంగా, అందంగా ఉందీ...

'మీ బాబు ఎంత ఉంటడు? తీసుకొస్తె బాగుండు' అన్నది సలీమ.

'చిన్నవాడే. ఐదేళ్లు దాటాయి. మళ్లీ ఎప్పుడైనా తీసుకొస్తాను.. భలే సింపుల్‌గ ఉంది మీ రూం. నాకు వచ్చినప్పటినుంచి ఆశ్చర్యంగా ఉందీ, ఇంత తక్కువ సామాన్‌తో ఎట్ల సర్దుకుంటారు?'

'సర్దుకోవడం ఏముంది, ఇంకొంచెం సామాన్ తీసేసినా ఫరక్ పడదు' అన్నది సలీమ నవ్వుతు 'మీరింక సుల్తాన్ రూం చూసి ఉండరు, ఒక చాప, రెండు చద్దర్లు, కొన్ని బట్టలు, కొన్ని గిన్నెలు, రూం నిండ పుస్తకాలుంటయ్, అంతే!' అన్నది మల్ల తనే..

'లోకమంతా ఒకదాని వెనక ఒక వస్తువు కొనడంలోనే జీవితాలు పరిగెత్తిస్తుంటే.. ఇంత సింపుల్‌గ ఎట్ల బతుకుతున్నారు మీరు?! నాకు భలే ఇంట్రస్టింగా ఉంది..'

'ఏముంది, పాత ఆలోచనల్ని మనసుల ఉండనియ్యనట్లే అవసరంలేని వస్తువుల్నీ ఇంట్ల ఉండనియ్యకుంటే సాలు. ఈ విషయంల సుల్తాన్‌తోని డిస్కషన్ షానా బాగుంటది. అతని రూం చూసినంకనె నేనిన్స్పైయిర్ అయ్న. ఏయ్ సుల్తాన్! మీ రూంకి ఎప్పుడు పోదాం? సుల్తాన్ రూంకి పోతే మంచి వంట చేసి పెడతడండి. నాకు అంత బాగ వండడం రాదు. అసలు నాకు ఈ వంటమీద ఇంట్రస్టే ఉండదు' గలగల మాట్లాడింది సలీమ. పద్మజ సలీమనే చూస్తూ ఉండిపొయ్యింది. ఏదో పుస్తకం తీస్కొని తిరిగేస్తున్న సుల్తాన్,

'సరెగని, చాయ్ కావాలె బై!' అన్నడు.

'పాలు తేవాలె సుల్తాన్! పొద్దున చాయ్ చేసుకోబుద్దికాలె. బైటికెళ్లి తాగొచ్చిన. ముగ్గురం పొయ్యి తెచ్చుకుందామా?'

'నేను తెస్తాన్లే. మీరు మాట్లాడుకుంట ఉండురి' అనుకుంట బైటికెళ్లిపోయిండు సుల్తాన్.

'ఇట్లా ఒంటరిగా ఉంటే బోర్ కొట్టదా? టీవీ, టేప్, ఫోన్ ఏమీలేవుకదా!'

'బోరెందుకు! నాకు బుక్స్ చదివే హాబీ వుంది. ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, తెలుగు నాలుగు భాషల్ల నావెల్స్, కతలు, పొయిట్రీ చదువుతుంట. మూడ్‌కు తగ్గ బుక్స్ చదువుత. సుల్తాన్ రూంల ఒగుడ షాన బుక్స్ ఉన్నయ్. సుల్తాన్ ఉన్నా లేకున్నా నా దగ్గరొక కీ ఉంది. పొయ్యి తెచ్చుకుంట. చదివే మూడ్ లేనప్పుడు సుల్తాన్‌తోని తిరుగుత'

'మీరు కూడా ఏమైనా రాస్తారా?'

'సుల్తాన్‌తో పరిచయమైనంకనే షానా లవ్ పొయిట్రీ రాసిన. ఎప్పటికైనా ఒక గొప్ప నవల రాయాలని ఉంది'

'మీ ఇద్దరి పరిచయం ఎలా అయింది?'

'మా బస్తీల ఒకసారి సుల్తాన్ ముస్లింల గురించి మాట్లాడుతుంటె చూసిన. మీటింగ్ అయ్నంక నాకున్న డౌట్స్ అన్నీ అడిగిన. షానా బాగ జవాబ్‌లు చెప్పిండు. తర్వాత ముస్లిం ఆడవాళ్ల ఒక మీటింగ్‌కు నన్ను పిలిచిండు. అట్ల ములాఖతైండు.. ఆ తర్వాత మొహబ్బత్.. అతని రూం.. పుస్తకాలు.. పొయిట్రీ.. ఆఖరికి ఒకటైపొయ్నం..'

'ఒకటడుగుతాను, ఏమీ అనుకోరుగదా..'

'అడగండి. ఏమైన నిస్సంకోచంగ అడగొచ్చు'

'సుల్తాన్ ఎప్పుడూ ఒక్కలా ఉండడు. ఒక్కలా మాట్లాడడు. నమ్మకం ఇవ్వడు. మీరతనితో ఇంత ధైర్యంగా ఎలా కలిసుండే నిర్ణయానికి వచ్చారు??'

'అవును. సుల్తాన్ మనకేం భరోసా ఇవ్వడు. నిన్నను ఇవ్వాళ మాట్లాడడు. ఇవాల్టిని రేపు మాట్లాడకపోవచ్చు. పెండ్లి చేసుకొని జీవితాంతం నీతోనే ఉంటనని మాటివ్వడు. ఐనా ఎందుకివ్వాలి. ఒకర్ని చూడకుండా ఒకరం ఉండలేనితనం, మాట్లాడుకోకుండా ఉండలేనితనమే ఉండాలె కాని మాటిచ్చుకోవడాలు, నమ్మకమనిపించడాలెందుకు? నేనతన్నిగాని, అతను నన్నుగాని నమ్మకం గురించో, భవిష్యత్ గురించో ఏమీ అడుక్కోలె. నేను ఎట్ల ఉన్ననో నన్నట్లనే స్వీకరించడం కదా ప్రేమంటే.. అయినా నేను అతని కనుకూలంగానో, అతను నాకనుకూలంగానో ఎట్లా ఉంటాం!? ఎట్లా మారతం?! సుల్తాన్ని యాజ్‌టీస్‌గా ఇష్టపడుతున్న నేను. అసలు అతనట్ల ఉండడాన్నే ప్రేమిస్తున్న..'

'బాగుంది.. మీరు చాలా స్పష్టంగా మాట్లాడుతున్నారు. సుల్తాన్ ఇంత స్పష్టంగా మాట్లాడతాడా?!'

'తను మాట్లాడడు. మనతో మాట్లాడిస్తడు.. అవసరమనుకుంటెనె తను మాట్లాడతడు'

'.. అవునూ.. మీరు ఇంత సింపుల్‌గా ఎలా ఉండగలుగుతున్నారు? మీ వాళ్లెవరూ ఏమీ అనరా, ఇట్లా ఒంటిమీద ఏమీ వేసుకోకుండా ఉంటే..!?'

'నామీద నాకు సోయి వచ్చినంక, మన మనసుల్ని ఆ సొమ్ముల చుట్టే తిరిగేటట్లు చేసిన కుట్ర సమజైనంక అన్నీ తీసిపారేసిన. మనసు నిలకడకోసం సుల్తాన్‌తో చర్చలు పనికొచ్చేవి. మావాళ్లు మొదట్ల తిట్టేటోళ్లు. మనకిష్టం లేకపోతె ఎవరైనా ఏం చెయ్యలేరుకదా..'

సుల్తాన్ లోపలికొచ్చుకుంట, 'ఇక్కడి షాప్‌ల అయ్‌పొయ్‌నయంట సలీమ్. మెయిన్‌రోడ్‌మీదికి పొయ్యి తెస్తున్న' అనుకుంట కిచెన్‌లకు పొయిండు.

'చాయ్ నువ్వే చెయ్ సుల్తాన్! సుల్తాన్ చాయ్ చేస్తె మంచి టేస్ట్ ఉంటది'

'ఆల్బమ్ ఏమైనా ఉందా?' అడిగింది పద్మజ.

'లేదు. మా ఇద్దర్కి గుడా ఫోటోల మీద ఇంట్రస్ట్ పొయింది. నా ఫోటోలు మా ఇంట్ల ఉండిపొయ్‌నై. తన ఫోటోలు వాళ్లింట్ల.. ఇద్దరం కలిసి ఇంతవరకు ఒక్క ఫోటో గుడ దిగలె'

'ఒక కవిత చెప్పండి'

'ఎవరిది, ఎసొంటిది చెప్పమంటరు?' అన్నది నవ్వుకుంట సలీమ.

'మీదే. మీకిష్టమైంది'

'...ఇగో, ఇటు చూడు

నన్ను చూడు

పై పై మెరుగుల్నేం చూస్తవ్

కండ్లు తిప్పుకోకుంట నా కండ్లల్లకు చూడు!

చేతులకున్న గాజు ముక్కల్నేం చూస్తవ్

చేతి చలువను చూడు

మెడల మెరిసే లోహాలను

గుండెలమీద మాంసం ముద్దల్నేం కొలుస్తవ్

మనసును, మనిషితనాన్ని తాకి చూడు

ఇంకెన్నాళ్లు నన్నో గజ్జెల గుర్రం చేసి

సవారీ చెయ్యాలనే చూస్తవ్?

నాలో మనిషిని చూడటం అలవర్చుకో...

అప్పుడే నువ్వు మగాడి స్థితినుంచి

మనిషిగా పరివర్తన చెందుతవ్...'

నోటికే చెప్పేసింది సలీమ స్థిరమైన గొంతుకతోని.

'బాగుంది' అన్నది పద్మజ విస్మయానికి గురవుతూ.

సుల్తాన్ చాయ్‌లు తెచ్చిచ్చిండు.

'మీరు పాటలు పాడేటోల్లని చెప్పిండు సుల్తాన్. ఒక పాట పాడండి' చాయ్ తాక్కుంట అడిగింది సలీమ.

'ప్రాక్టీస్ పొయింది. చాలా రోజులయ్యింది పాడి'

'పర్వాలే, పాడండి'

అంతా కాస్త మౌనమైపొయ్యి చాయ్ తాక్కుంట గడిపిన్రు. చాయ్‌కప్పు కింద పెట్టి పాడటానికన్నట్లు ఆలోచించుకుంట కొద్దిసేపు ఆగింది పద్మజ. తర్వాత పాట షురూ చేసింది. ఆమె గొంతుల ఏదో బాధ.. సుల్తాన్ మనసంత ఏందో అయిపొయ్యింది. బాదగ కండ్లు మూసుకుండు.

'ఖాలీ హాత్ షామాయీ హై

ఖాలీ హాత్ జాయేగీ

ఖాలీ హాత్ షామాయీ హై..

ఆజ్ భీ న ఆయా కోయీ

*ఆజ్ భీ న ఆయా కోయీ*

*ఖాలీ లౌట్ జాయేగీ... ...*

☯ ☯

చీకటి పడబోతుంటె ఇంటికొచ్చింది పద్మజ. ఇంకా కిరణ్ రాలె. పిలగాడు పండుకొనుండు. పద్మజకేం తోస్తలె. కాలు నిలుస్తలె. బట్టలుగుడ మార్చుకోలె. అటూఇటూ తిరగబట్టింది. –మనసంతా ఏదో అయిపోయిందనిపిస్తోంది. ఏం చెయ్యాలి. ఫ్చ్! ఈ ఇంట్లో ఒంటరిగా ఏంటిలా– బట్టలు మార్చుకుంటాన్కి ఎల్లబోయి అద్దం ముందల నిలబడి చూసుకుంది. మెడనిండ, ముక్కుకు, చెవులకు ఉన్న సొమ్ములను చూస్తే చికాకెయ్యసాగిందిప్పుడు. ఒక్కసారిగ అసహ్యం ముంచుకొచ్చింది. అన్ని తీసి పారేసింది.. –ఎంత హాయిగా ఉందీ! ఏమీ వేసుకోకపోతే అదొక రకమైన అందం.. అదే అనేవాడు కదా సుల్తాన్, కాలేజ్ రోజుల్లో.. బోసి మెడను, బోసి నుదురును అందంగా, కవిత్వంగా పొగిడేవాడు. అయినా తనేంటిలా పై పై పూతలకు లొంగిపోయింది! మాటిమాటికి సలీమా గుర్తొస్తుంది– ఎంత సింపుల్‌గా ఉంది, ఎంత హాయిగా, హుషారుగా, తృప్తిగా ఉంది, ఫ్చ్!– ..బెడ్‌రూమ్‌ల కెల్లింది. ఉండబుద్ధి కాలె. వంటింట్ల కెల్లింది. ఏం ముట్టుకోబుద్ధి కాలె. విద్యార్థి ఉద్యమంలో ఏదో ప్రదర్శనలో ముందు వరుసలో తను స్లోగన్స్ ఇచ్చుకుంట నడుస్తున్నది గుర్తొస్తున్నది.. స్త్రీ సమస్యల గురించిన సభలో ఆవేశంగా మాట్లాడుతున్న సన్నివేశం వెంటాడుతోంది.. సుల్తాన్‌తో లోకం పట్టకుండా గలగలా నవ్వుతున్న దృశ్యాలెన్నో.. గొడవ పడుతున్న దృశ్యాలెన్నో.. బైస్ చేస్తున్న దృశ్యాలెన్నో.. మనసును అతలాకుతలం చేస్తున్నాయి.. ..

నీరసంగ కూలబడిపోయింది..

–ఏదో అవుతోంది తనలో.. ఏదో చెయ్యాలి.. ఫ్చ్! తనుండాల్సింది ఇక్కడ కాదు.. తను బతకాల్సింది ఇట్లా కాదు. ఇట్లా కోళ్ల ఫారంలో కోడిలాగా బతకడం దారుణం. ఉహుఁ. తనేమైనా చెయ్యగలదు. తన కిష్టమైంది చెయ్యాలి. తన కిష్టమైనట్లుగా జీవించాలి. ఇప్పటికే ఆరేళ్లు ఆర్పేసుకుంది. అయినా మించిపోయిందేమీ లేదు. ఈ ఇల్లు తనకు సరికాదు, ఈ మనిషి తనకు సరైన తోడు కాదు. ఉహూఁ.. తన జీవితం ఇలా ముగిసిపోకూడదు.. తను జీవించాల్సిన జీవితం వేరే ఉంది– ఉహూఁ.. ఏదో ఒకటి చెయ్యాల్సిందే..

అలజడి–అలజడైలేచింది పద్మజ..

❍

*'లోహం' సుల్తాన్‌ని ప్రేమించిన పద్మజ కథ, డిసెంబర్ 2004*